క్లుప్తంగా

విద్యుత్ కోతలు లేకుండా చర్యలు



గుడివాడరూరల్: గ్రామాల్లో విద్యుత్ కోతలు లేకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారుల పనితీరు అధ్వానంగా ఉందన్నారు. వారు తీరు మార్చుకోవాలన్నారు. నియోజకవర్గంలో సక్రమంగా విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో విద్యుత్ ఈఈ జీవీ శ్రీనివాసరావు, ఏడీఈలు కె.వర్మ, పి.కిరణ్‌బాబు, ఏఈలు సూర్యప్రకాష్, బ్రహ్మానందం, టీడీపీ నాయకులు పిన్నమనేని బాబ్జీ, లింగం ప్రసాద్ పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు



ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. ఈ అభిషేకాలు చేయించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామి వారి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేసి అభిషేకాలు చేయించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ. ఆర్ గంగాశ్రీదేవి పర్యవేక్షించారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సత్యనారాయణ




మొవ్వ: స్థానిక క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డి.సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తణుకు చిట్టూరి ఇందిరయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో కామర్స్ లెక్చరర్‌గా పనిచేశారు. ఉద్యోగోన్నతిపై మొవ్వ జూనియర్ కళాశాలకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఫొటోతో కళాశాలకు వచ్చి జాయిన్ కావాలని పిలుపునిచ్చారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులతోపాటు ఒకేషనల్ కోర్సులలో అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్, మెకానికల్ అండ్ టెక్నీషియన్, ఆఫీస్ అసిస్టెంట్ షిప్ గ్రూపులలో పరిమిత సీట్లు ఉన్నాయని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తోట్లవల్లూరు: కలుపు మందు తాగు వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బొడ్డపాడులో జరిగింది. పోలీసుల కథనం మేరకు బొడ్డపాడుకు చెందిన మార్గాన్ని సుశీల (39)కు ఉయ్యూరు మండలం పెద ఓగిరాలకు చెందిన మార్గాన్ని మురళీకృష్ణతో 22 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా రెండేళ్లుగా సుశీల బొడ్డపాడులోని పుట్టింట్లోనే ఉంటోంది. కాపురానికి రావాలని ఇటీవల భర్త మురళీకృష్ణ లాయర్ నోటీసు పంపారు. చిన్న వయస్సులో జీవితం పాడు చేసుకోవద్దని కుటుంబ సభ్యులు నచ్చజెప్పే ప్రయత్నం చేయటంతో సుశీల మనస్థాపానికి గురైంది. ఈ నెల 2వ తేదీ ఉదయం కలుపు మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలి తల్లి ఉప్పు నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అవినాశ్ తెలిపారు.

ఖరీఫ్‌కు వరి విత్తనాలు సిద్ధం



విజయవాడరూరల్: ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బీ రంగనాథ్‌బాబు మంగళవారం తెలిపారు. బీపీటీ 5204, ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 రకాల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఒక్కో రైతుకు ఎకరానికి 30 కిలోల బస్తాను విక్రయించడం జరుగుతుందని తెలిపారు. 25 కిలోల బీపీటీ–5204 బస్తా రూ.950, 30 కిలోల ఎంటీయూ–1318, ఎంటీయూ–1061 బస్తా రూ.1,150లు చొప్పున ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా రొయ్యల సాగు

- ఉప్పునీటి కయ్యలుగా కాల్వలు, చానల్స్
- అనుమతులు లేకుండానే ఉప్పునీటి బోర్లు

గుడివాడరూరల్: నందివాడ మండలంలో రొయ్యల సాగులోని లాభాల మోజులో ఆక్వా రైతులు నిబంధనలను తుంగలో తొక్కి సిరులు పండించే భూములను ఉప్పునీటి చెరువులుగా మార్చేశారు. దీంతో భవిష్యత్‌లో ఈ భూములు సాగుకు పనికి రాని చౌడు భూములుగా మారే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

చేపల సాగు పేరిట అనుమతులు

మండలంలో రెండు దశాబ్దాల కాలంలో 43 వేల ఎకరాలను చేపల చెరువుల సాగు పేరిట అనుమతులు తెచ్చి చెరువులుగా మార్చేశారు. కొంతకాలం వరకు అనుమతులు మేరకు చెరువుల్లో చేపల సాగే చేశారు. కాలక్రమేణా రొయ్యల సాగుపై రైతులు లాభాల మోజు పెంచుకోవడంతో సగానికి సగం చేపల చెరువులు రొయ్యల చెరువులుగా మారిపోయాయి. రెండేళ్లలో పరిస్థితి తలకిందులైంది. చేపల సాగు కంటే రొయ్యల సాగు అధికమవ్వడంతో చేపలను రొయ్యలు దాటేశాయి.

ఎందుకిలా..

చేపల సాగుకు పెట్టుబడులతో పాటు, చేపల పెరుగుదలకు సుమారు 6 నుంచి 7 నెలల సమయం పడుతుంది. అదే రొయ్యల సాగైతే సమయం ఆదా అవుతుంది. మూడు లేదా నాలుగు నెలల్లోనే రొయ్యలు చేతికందుతాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో లాభాలు బాగా వస్తున్నాయి. విదేశాలకు ఎగుమతులు కూడా చేసుకోవచ్చు. అందుకే చాలా మంది ఆక్వా రైతులు రొయ్యల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అయితే మంచినీటి చెరువుల్లో రొయ్యల సాగు చేపట్టాలంటే వివిధ శాఖల ప్రత్యేక అనుమతులు తీసుకోవాలి. అలాంటిది ఎటువంటి అనుమతులు లేకుండానే రొయ్యల సాగు చేపట్టి మంచినీటి చెరువులను ఉప్పుకయ్యలుగా, భూములను చౌడు భూములుగా మార్చేస్తున్నారు. దీంతో వాతావరణ, నీటి కాలుష్యం ఏర్పడి పర్యావరణం దెబ్బతింటుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రొయ్యల సాగు చేపట్టిన యజమానులు చెరువు గట్లపైనే పెద్ద ఎత్తున బోర్లను ఏర్పాటు చేస్తున్నారు. వాస్తవానికి బోర్ల ఏర్పాటుకు అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా అదేమీ లేకుండానే అడ్డగోలుగా ఎక్కడబడితే అక్కడ చెరువు కరకట్లపై బోర్లు ఏర్పాటు చేసేశారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలు కనీసం మట్టానికి అడుగంటి ఉప్పునీటి జలాలు ఎక్కువ అవ్వడంతో ప్రమాదకరంగా మంచినీటి జలాల పరిస్థితి తయారైంది.

అనుమతులు లేవు

వాస్తవానికి ఉప్పునీటిలో రొయ్యల సాగుకు రాష్ట్రంలో ఎక్కడా అనుమతులు ఇచ్చిన దాఖలాలు లేవు. అయినా రైతులు అడ్డగోలుగా రొయ్యల చెరువులు ఏర్పాటు చేసి పట్టుబడుల సమయంలో ఉప్పునీటిని మంచినీటి కాల్వలు, చానల్స్‌లోకి వదిలేస్తున్నారు. ఫలితంగా నందివాడ మండలంలో ఉన్న నెహ్రాల్లీ, దోసపాడు, గుడివాడ, అరిపిరాల, పొనుకుమాడు, మోటూరు మంచినీటి చానల్స్ ఉప్పునీటి చానల్స్‌గా మారిపోయాయి. మంచినీటి చెరువులకు నీళ్లు పెట్టుకోవడానికి కృష్ణానదిని నీటిని వదిలినా మండలానికి వచ్చే సరికి మంచినీరు కాస్త ఉప్పునీరుగా మారిపోతున్నాయి. ఆ నీటినే గ్రామ పంచాయతీల వారు తాగునీటి చెరువులకు పెట్టేస్తున్నారు. దీనివలన చెరువులు సైతం ఉప్పునీటి చెరువులుగా మారి తాగునీటికి పనికి రాకుండా పోతున్నాయి.



నందివాడలో సాగు చేస్తున్న రొయ్యల చెరువు



ఎల్ఎన్‌పురంలో మంచినీటి చెరువుల ముసుగులో రొయ్యల సాగు

అడ్డగోలుగా రొయ్యల మేతల షాపులు

రొయ్యల సాగుకు ప్రత్యేకంగా ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోయినా గ్రామాలతో పాటు పట్టణాల్లో కూడా రొయ్యల మేతలు, మందుల షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ప్రభుత్వం నిషేధించిన యాంటిబయోటిక్ మందులను సైతం రొయ్యల చెరువుల్లో లీజుదారులు అడ్డగోలుగా ఉపయోగిస్తున్నారు. ఫలితంగా భూమి సారం పోవడంతో పాటు భూములు ఉప్పునీటి, చౌడు భూములుగా మారిపోతున్నాయి. యాంటిబయోటిక్స్ వలన యాధృచ్ఛికంగా పెరగాల్సిన రొయ్యలు తక్కువ సమయంలోనే రొయ్యల సాగు చేతికి వస్తుండటంతో లీజుదారులు ఇష్టారాజ్యంగా మందులను వినియోగిస్తున్నారు. సంబంధిత మత్స్యశాఖ అధికారులు అటువైపుగా చూసిన దాఖలాలు లేవు. ఇదే పరిస్థితి కొనసాగితే కొద్దికాలానికి నందివాడ, గుడివాడ మండలాల్లోని గ్రామాల్లో భూములు సారవంతం కోల్పోయి ఎటువంటి సాగుకు పనికి రాకుండా పోయే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అనుమతులు లేని రొయ్యల సాగును నిషేధించాలని పర్యావరణ వేత్తలు, ప్రజలు కోరుతున్నారు.

భవిష్యత్ తరాలకు ఇబ్బంది

అనుమతులు లేని రొయ్యల చెరువులు సాగు చేయటం వల్ల భవిష్యత్ తరాలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. చేపల సాగు పేరిట అక్రమ రొయ్యల సాగు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటం దారుణం. రొయ్యల సాగు చేస్తున్న భూములు చౌడు భూములుగా మారి పనికి రాకుండా మిగిలిపోతాయి. రొయ్యల సాగు వల్ల పంట కాల్వలతో పాటు డ్రెయిన్లు, చానల్స్ కలుషితమై ప్రజలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం అనుమతులు లేని అక్రమ రొయ్యల సాగు వెంటనే అరికట్టాలి.

– ఆర్‌సీపీ రెడ్డి, సీపీఎం నాయకుడు

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఏఈ శేఖర్

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ శేఖర్ మంగళవారం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. గతంలో గృహ నిర్మాణాలకు రూ.1.8 లక్షలకు తోడుగా అదనంగా మరో రూ.50 వేలు పెరిగిన కారణంగా త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. గ్రామానికి చెందిన 59 మంది లబ్ధిదారులకు ఈ మేరకు సూచించారు.

వృద్ధురాలి ఇంటి వద్దకు రేషన్

పెదపారుపూడి: పెదపారుపూడిలోని వృద్ధుల ఇంటివద్ద రేషన్‌ను తహసీల్దార్ వై.రంగారావు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 65 సంవత్సరాల వయస్సు దాటిన వారికి ఇంటి వద్దకు వచ్చి రేషన్ సరుకులు ఇవ్వటం జరుగుతుందన్నారు.

కైకలూరులో..

కైకలూరు: వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తున్నామని కైకలూరు తహసీల్దారు ఎండీ ఇబ్రహీం తెలిపారు. మండలంలోని ఆటపాకలో వృద్ధురాలి ఇంటికి వెళ్లి సరుకులను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండలంలో 65 సంవత్సరాలు దాటిన వృద్ధుల కార్డులు 2,439 ఉన్నాయన్నారు. డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాయిస్, ప్రసాద్ పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనకు సరైన మార్గం గ్రంథపఠనం



జమీగొల్వేపల్లిలో గ్రంథపఠనం చేస్తున్న విద్యార్థులు



ముదినేపల్లి గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథలు బోధిస్తున్న లైబ్రేరియన్

పామర్రు: జ్ఞాన సముపార్జనకు సరైన మార్గం గ్రంథపఠనమని గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ పేర్కొన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు గ్రంథపఠనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎంత చదివితే అంత నేర్చుకోవడం జరుగుతుందన్నారు. పుస్తకం ఒక నమ్మకమైన నేస్తమని తెలిపారు. విద్యార్థులు చిన్న నాటి నుంచే గ్రంథాలయాలకు రావటం అనేది ఒక అలవాటుగా మార్చుకోవాలన్నారు.

విద్యార్థులకు నీతి కథలు

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు మంగళవారం నీతికథలు బోధించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి మిత్రలాభం, మిత్రభేదం పుస్తకాల నుంచి పలు నీతి కథలను చదివి వినిపించారు. అనంతరం ఆటల పోటీలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

'వెన్నుపోటు దినం'ను విజయవంతం చేయండి

పామర్రు: పామర్రులో బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని ప్రజాప్రతినిదులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ కోరారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నుంచి భారీ ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వ అరాచక పాలనపై తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి, అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

గుడివాడలో..

గుడివాడరూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, దీనికి నిరసనగా వైఎస్సార్ సీపీ తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిన్ని సత్యదుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది అయిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుందన్నారు. దీనికి నిరసనగా వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని ఈనెల 4వ తేదీన ఉదయం 9గంటలకు గుడివాడ ఎన్టీఓ హోమ్ దగ్గర నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళతామన్నారు. అనంతరం వినతిపత్రం ఇచ్చే కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కైకలూరులో..

కైకలూరు: ప్రజలకు హామీలిచ్చి వాటిని గాలికొదిలేసిన చంద్రబాబు చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయాలపై బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు సింగంశెట్టి రాము మంగళవారం కోరారు. కై కలూరు రైల్వేస్టేషన్ రోడ్‌లో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్దకు బుధవారం ఉదయం 9 గంటలకు నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు రావాలని కోరారు.

కొమరవోలు డ్రెయిన్ అభివృద్ధికి కృషి



జమీగొల్వేపల్లి(పామర్రు): కొమరవోలు డ్రెయిన్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని కొమరవోలు డ్రెయిన్ పూడికతీత పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రెయిన్‌లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు పనులు స్థానిక రైతులే స్వచ్ఛందంగా చేయటం అభినందనీయమన్నారు. సేకరించిన నగదు పూడికతీతకు సరిపోవడం లేదని రైతులు వివరించారని తెలిపారు. ఈ విషయమై నీటి సంఘాల నాయకులు, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి డ్రెయిన్‌లో పూర్తిస్థాయిలో పూడిక తీత పనులకు నిధులను తప్పనిసరిగా మంజూరు చేయించేందుకు చర్యలు చేపడతామన్నారు. డీసీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, రైతు వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

ముగిసిన వేద పండిత సభలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరామునిపేటలో శ్రీ దేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం (యతి రాజ భవనం)లో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ ఉభయ వేదాంత పండిత సభలు మంగళవారంతో ముగిశాయి. వెంకటాచార్యస్వామి అధ్యక్షతన జరిగిన ఈ పండిత సభలో పలు అంశాలపై స్వామీజీలు అనుగ్రహ భాషణం చేశారు. సింగరాచార్య స్వామి శ్రీమన్నారాయణుని కల్యాణ గుణములు, శ్రీరంగనాథ స్వామి శ్రీమన్నారాయణుని సర్వసులభుడు అనే అంశాలపై ప్రసంగించారు. వీరి ప్రసంగాన్ని భక్తులు ఆసక్తిగా విన్నారు. ఈ కార్యక్రమాన్ని యతిరాజ భవన కార్యదర్శి దోరడ్ల హేమప్రకాష్, ఉపాధ్యక్షుడు కంతేటి శ్రీనివాసగుప్తా, కోశాధికారి మాజేటి మోహన మురళి, కంతేటి లక్ష్మి, చక్కా హిమవతి సువర్చలాదేవి, కొప్పర్తి రవి శంకర్, ఉదయగిరి సతీష్, వేముల కుమారస్వామి, వేముల శ్రీలక్ష్మి పర్యవేక్షించారు.

ఆరోపణలు రుజువు చేస్తే రాజకీయ సన్యాసం



మాట్లాడుతున్న తాడిశెట్టి శ్రీనివాసరావు, దాసరి అశోక్‌కుమార్

పామర్రు: మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌పై జనసేన ఇన్‌చార్జి నరేష్ లేనిపోని ఆరోపణలను చేస్తున్నారని, వాటని రుజువు చేస్తే రాజకీయ సన్యాసం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ నాయకుడి సమావేశంలో మీ వెనుక ఉన్న వారే వెన్ను పోటుదారులని మాట్లాడిన జనసేన ఇన్‌చార్జి నరేష్ మాటలు హాస్యాస్పదంగా ఉందన్నారు. ముందు నీ స్థాయి ఏమిటో తెలుసుకుని మాట్లాడటం మంచిదని హితవు పలికారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ సోమవారం జరిగిన విలేకరుల సమావేశం పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కొమరవోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్టు ఆపరేటర్ ఉద్యోగం విషయంలో స్థానిక ఎమ్మెల్యే నగదు తీసుకున్నారని ఆరోపణ చేశారన్నారు. దీనికి సంబంధించి తీసుకున్నారా, లేదా అనే విషయం పై సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. ఈ విషయమై మాట్లాడాల్సిన ఎమ్మెల్యే మాట్లాడకుండా జనసేన ఇన్‌చార్జి నరేష్ మాట్లాడటం సరికాదన్నారు. నియోజకవర్గంలో ఇసుక మాఫియా , మట్టి కుంభకోణాల్లో కోట్ల నగదు చేతులు మారాయని, తమ వద్ద ఆధారాలున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నకు సమాధానం స్థానిక ఎమ్మెల్యే చెప్పాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, ఎంపీటీసీలు కారుమంచి నాగ మల్లేశ్వరరావు, తలారి మహేష్, పామర్రు మండల, టౌన్ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, సురేష్‌రెడ్డి, పార్టీ నాయకులు ఆరుమళ్ల శ్రీనాధ్‌రెడ్డి బివి రాఘవులు, చాట్ల అంజి,నత్తా రవి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో భూమి సారవంతం

చల్లపల్లి: భావి తరాలకు ఆరోగ్యవంతమైన, సారవంతమైన భూమిని అందించాలంటే రైతులు వాడే రసాయనిక ఎరువుల్లో కనీసం 30 శాతం అయినా సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని కృషి విజ్ఞాన కేంద్రం సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి రైతులకు సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల ఆధ్వర్యంలో మండలంలోని యార్లగడ్డ గ్రామంలో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ సదస్సును నిర్వహించారు. ఎంఏవో సాయిసింధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటలక్ష్మి మాట్లాడుతూ పూర్తిగా రసాయనిక ఎరువులు వాడటం వల్ల ప్రస్తుతం పంట దిగుబడులు ఎక్కువగా వచ్చినప్పటికీ భవిష్యత్తులో ఈ భూములన్నీ చౌడు భూములుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు 30 శాతం సేంద్రియ ఎరువులు, 70 శాతం రసాయనిక ఎరువులు వాడుకోవటం వల్ల భూమి నిత్యం సారవంతంగా ఉంటుందని వివరించారు. పోలంలో వాడుకునేందుకు జీవన ఎరువులు ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ (పెదవేగి) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కళ్యాణ్‌బాబు, ఉయ్యూరు చెరకు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ఉద్యాన శాఖాధికారి జె.కీర్తి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. అనంతరం ఇఫ్కో ఆధ్వర్యంలో డ్రోన్ సహాయంతో పంట పొలాలపై మందుల పిచికారీ విధానాన్ని రైతులకు వివరించారు.

మజ్జిగ పంపిణీ



పామర్రు: స్థానిక పోలవరం–ఉండ్రపూడి వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో దాతలు భక్తులకు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారని ఆలయ ఈఓ ప్రసాదరావు పేర్కొన్నారు. పునాది పాడు గ్రామానికిచెందిన భక్తులు శ్రీ విజయ ఫుడ్స్ అధినేత శీలం సోమేష్, సుశీల, జాహ్నవి సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

కోవిడ్‌ను ఎదుర్కోవడానికి సర్వం సిద్ధం

కైకలూరు: కోవిడ్ కేసులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సర్వం సిద్ధంగా ఉన్నామని కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ అల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. సిబ్బందితో కలిసి కోవిడ్ ప్రత్యేక గదిని మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోవిడ్ కోసం ప్రత్యేక వార్డు సిద్ధం చేశామన్నారు. ఆక్సిజన్ సిలిండర్స్, ఆక్సిజన్ కాన్సంట్రేట్స్, వెంటిలేటర్స్, మందులు, కోవిడ్ ర్యాపిడ్ కిట్స్, పీపీఈ కిట్స్, మాస్క్, గ్లోవ్స్ తదితర అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

పెదపారుపూడి: మండలలోని పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మల్లీశ్వరీ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయాల ఇంజినీరింగ్ అస్టిసెంట్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయలేకపోవటానికి గల కారణాలు తెలియజేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రు సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఏఈ పూర్ణచంద్రరరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పెదపాలపర్రు, ప్రత్తిపాడు గ్రామాల్లో విద్యుత్ లైన్లకు దగ్గరలో ఉన్న చెట్లను కొడతారని పేర్కొన్నారు. దీని వలన సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని యలమర్రు ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ వరకుమార్ మంగళవారం తెలిపారు. యలమర్రు, అప్పికట్ల, ఈదులమద్దాలి, జువ్వనపూడి, చినపారుపూడి తదితర గ్రామాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: విద్యుత్ లైన్లకు మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ విద్యుత్ శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. కై కలూరులోని దానగూడెం రోడ్డు, బైపాస్ రోడ్డు, పెద్దమసీద్ సెంటర్, మెయిన్ రోడ్డు, తాలూకా సెంటర్, కోర్ట్, బస్టాండ్, డిగ్రీ కాలేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు.

ఘర్షణ.. ఇద్దరి అరెస్టు

కైకలూరు: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిని కత్తితో బెదిరించి బుల్లెట్ వాహనాన్ని తీసుకెళ్లిన ఇద్దరిని కైకలూరు పోలీసులు అరెస్టు చేసి, మంగళవారం రిమాండ్‌కు తరలించారు. టౌన్ సీఐ పి.కృష్ణ, ఎస్‌ఐ వెంకట్‌కుమార్ మాట్లాడుతూ మే 31న మర్రి రాము అనే వ్యక్తి వాహనంపై వెళుతుండగా జాన్‌పేట వద్ద ఇదే ప్రాంతానికి చెందిన కుమ్మరిగుంట మదన్ కుమార్, రాయినూతల విజయ్ అనే ఇద్దరు బెదిరించారన్నారు. వార వద్ద నుంచి బుల్లెట్, కత్తిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



మర్రివాడలో మాట్లాడుతున్న గణేష్, మహేష్

పమిడిముక్కల: కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ కోరారు. కూటమి ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలేమీ నెరవేర్చలేదన్నారు. నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ నాయకులు కోడెబోయిన కోటేశ్వరరావు, గొర్కెపూడి బుజ్జి, కొణతం శివ రామకృష్ణ, బొల్లా రాంబాబులతో కలిసి పర్యటించి పార్టీ శ్రేణులను సమాయత్తం చేశారు.